అంబేడ్కర్ విగ్రహావిష్కరణ బృహత్తర ఘట్టం

- దళిత, బహుజన, మైనార్టీ, ప్రజా సంఘాల నాయకుల హర్షం
- నగరం నుంచి విజయవాడకు భారీగా తరలి వెళ్లనున్న నేతలు

నెహ్రూనగర్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు రాష్ట్ర ప్రభుత్వం మరో అరుదైన గౌరవం కల్పించడంతో దళిత, బడుగు, బలహీన, బహుజన, మైనార్టీ, ప్రజా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వం అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని శంకుస్థాపన చేసి గాలికొదిలేసిందని విమర్శిస్తున్నారు. చెప్పిన మాట విధంగా సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి విజయవాడలో అంబేడ్కర్ స్మృతి వనం ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమని కొనియాడుతున్నారు. పీడిత కులాలకు రాజ్యాంగం ద్వారా సమాన హోదా కల్పించి వారికి సమాజంలో గౌరవం కల్పించిన అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డులో 206 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేయడం శుభపరిణామని పేర్కొన్నారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అంబేడ్కర్ ఆలోచన విధానాలకు అనుగుణంగా నడుస్తున్న ఆయనకు రుణపడి ఉంటామంటూ తెలిపారు.

మాట తప్పిన గత ప్రభుత్వం



సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని 206 అడుగుల విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డులో ఏర్పాటు చేయడం దళిత, బహుజన, మైనార్టీలు గర్వించదగ్గ విషయం. గత టీడీపీ ప్రభుత్వం అమరావతిలో అంబేడ్కర్ స్మృతి వనం ఏర్పాటు చేస్తామని చెప్పి శంకుస్థాపన చేసి వదిలేసింది. కానీ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన విధంగానే విగ్రహం ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయం.

– మేడిద బాబూరావు, ఏపీ ఎస్సీ వెల్ఫేర్ సెక్రటరీ జనరల్.

చరిత్రలో నిలిచిపోతుంది



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సమాన హోదా కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన అంబేడ్కర్ ఆలోచన విధానాలను పక్కాగా అమలు చేస్తున్న గొప్ప అంబేడ్కర్ వాది సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి. చరిత్రలో నిలిచిపోయే విధంగా విజయవాడలో 206 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయడం శుభపరిణామం.

– మద్దు ప్రేమజ్యోతిబాబు, క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు.

చారిత్రాత్మక కట్టడం



విజయవాడ కేంద్రంగా 206 అడుగుల చారిత్రాత్మక కట్టడాన్ని సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించడం చరిత్రలో నిలిచిపోయే అంశం. ప్రపంచ వ్యాప్తంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఎనలేని గుర్తింపు ఉంది. ఏపీలో ఏర్పాటు చేస్తున్న అంబేడ్కర్ విగ్రహం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిపోతుంది.

– సోమి కమల్, రెల్లి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు.

పీడీత వర్గాలకు గౌరవం



ఆనాడు అంబేడ్కర్ దళిత, బహుజన, పీడిత, మైనార్టీలకు సమన్యాయం కల్పించి సమాజంలో తమకంటూ ఒక గుర్తింపు అందించారు. నేడు సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ కేంద్రం 206 అడుగుల విగ్రహం ఏర్పాటు చేయడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పీడిత వర్గాలకు గౌరవం చేకూర్చే అంశం.

–అన్నవరపు మల్లేశ్వరరావు, నేషనల్ ధోబీ మహా సంఘ్ జాతీయ అధ్యక్షుడు.

బడుగు వర్గాలకు దక్కిన గౌరవం



తెనాలి: విజయవాడ నడిబొడ్డున స్వరాజ్ మైదాన్‌లో ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ యావత్ భారత జాతికి గర్వకారణమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. 81 అడుగుల పీఠంపై 125 అడుగుల విగ్రహం కలుపుకుని మొత్తం 206 అడుగుల సామాజిక మహాశిల్పం , స్మృతివనం ఆవిష్కరణ చేయటమంటే మనల్ని మనం గౌరవించుకోవటమేనని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థిక శక్తి ఎవరి చేతుల్లో ఉంటుందో? రాజకీయాధికారం వారి చేతుల్లోనే కేంద్రీకృతమై ఉంటుందని, అందుచేత నిమ్న జాతి ప్రజలు ముందుగా విద్యావంతులైతే అధికారం దానంతటదే వస్తుందని చైతన్యాన్ని నింపిన దార్శనికుడు డాక్టర బీఆర్ అంబేడ్కర్ అని పేర్కొన్నారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ బడుగు, బలహీనవర్గాలకు దక్కిన కీర్తి ప్రతిష్ఠగా స్పష్టం చేశారు. విగ్రహావిష్కరణను తిలకించి, స్ఫూర్తి పొందాలన్నారు.

క్లుప్తంగా

అనాథలను ఆదరించడం అభినందనీయం



తెనాలిరూరల్: అనాథలను ఆదుకునేందుకు చొరవ చూపడం అభినందనీయమని రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ జె. శ్రీసీత అన్నారు. స్థానిక ఐతా నగర్‌లో నెలకొల్పిన పీజీఎం చిల్డ్రన్ హోంను న్యాయమూర్తి గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనాథలను ఆదరించి, వారిని ప్రయోజకులను చేయడం ద్వారా సమాజం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. నిర్వాహకులు జె. మహేష్ బాబు, మౌనిలను అభినందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు, కంచర్ల చంద్రశేఖర్, కంచర్ల కోటేశ్వరరావు, జి. సురేష్‌బాబు, కె. నాగభూషణం, రవినాయక్ పాల్గొన్నారు.

16 నుంచి టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కొరిటెపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16వ తేదీ నుంచి మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు డైరెక్టర్ జి.బి.కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ 30 రోజుల పాటు ఉంటుందని వెల్లడించారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనంతో పాటు వసతి సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్టుసైజు ఫోటోలతో యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం శిక్షణ సంస్థ, ఓల్డ్ బ్యాంక్ వీధి, కొత్తపేట, 0863-2336912, 9700687696, 8125397953, 9949930155 నంబర్లను సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

నిత్యావసరాల పంపిణీ



తెనాలిరూరల్: పెదరావూరులోని పెన్నీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వితంతువులకు నూతన వస్త్రాలు, నిత్యావసరాలను గురువారం పంపిణీ చేశారు. సంస్థ డైరెక్టర్ ప్రదీప్ దోనేపూడి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సినీ దర్శకుడు దిలీప్‌రాజా అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వృద్ధులైన పేద వితంతువులను ఆదరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

స్వర్ణకార్మికుడి అదృశ్యం



మంగళగిరి : పట్టణానికి చెందిన స్వర్ణకార్మికుడు అదృశ్యమైనపై కేసు నమోదైంది. పట్టణ పోలీసులు వివరాల మేరకు.. పట్టణంలోని ఆంజనేయ కాలనీకి చెందిన వంగర తేజ నాగశివరావు స్వర్ణకార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 8న రాత్రి ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లిన అతను ఇంటికి తిరిగి రాలేదు. స్నేహితులను, బంధువులను విచారించిన కుటుంబ సభ్యులు.. వారం రోజులైనా నాగశివరావు ఆచూకీ లభించకపోవడంతో బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

22ను సెలవు దినంగా ప్రకటించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఈనెల 22ను సెలవు దినంగా ప్రకటించాలని హిందూ ఉపాధ్యాయ సమితి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.ఆర్.వి. ప్రసాదరెడ్డి, ఎం. కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భరతజాతికి ఆదర్శ ప్రాయుడు, కుటుంబ వ్యవస్థకు మూల పురుషుడైన శ్రీరాముని ఆలయ ప్రారంభోత్సవం, ప్రాణ ప్రతిష్ఠ హిందువుల చిరకాల స్వప్నమని, 500 ఏళ్ల కల సాకారమవుతున్న రోజును ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్పించిన మత స్వాతంత్ర్యపు హక్కును స్వేచ్ఛగా పాటించే అవకాశాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

మద్యం విక్రేత అరెస్ట్

తెనాలిరూరల్: మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అరెస్ట్ చేశారు. హాఫ్‌పేట గ్రామంలో మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన కనపర్తి రాజు అలియాజ్ ఏసోబు మద్యం విక్రయిస్తుండగా అతన్ని అదుపులోకి తీసుకున్నారు. 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. దీంతో కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కళలను, కళాకారులను కాపాడుకోవాలి



శ్రీకళా నిలయం కార్యదర్శి ప్రభాకరరెడ్డి దంపతులకు సన్మానం

కొల్లిపర: కళలను, కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గుదిబండి చినవెంకటరెడ్డి అన్నారు. కొల్లిపరలోని అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలోని అన్నపరెడ్డి శివరామిరెడ్డి స్మారక కళా ప్రాంగణంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సాంస్కృతిక సంబరాల ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా గురువారం పాల్గొన్నారు. శ్రీ కళానిలయం కమిటీ సభ్యుడు వంగా లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో చినవెంకటరెడ్డి మాట్లాడుతూ శ్రీ కళానిలయం కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి దశాబ్ద కాలంగా సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి తెలిసేలా సాంస్కృతిక సంబరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఔన్నత్యం, ఆప్యాతల గురించి నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా బొమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి దంపతులను కళాకారులు, గ్రామ పెద్దలు సన్మానించారు. గ్రామ ఉప సర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, శ్రీ కళానిలయం అధ్యక్షుడు జొన్నల అమ్మిరెడ్డి, కార్యవర్గ సభ్యులు ఆరిమండ శివశంకర్‌రెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, జొన్నల శ్రీనివాసరెడ్డి, , కూరపాటి రవిశేఖర్‌రెడ్డి, బొల్లిముంత కృష్ణ మాష్టారు, కల్లం వీరారెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, జొన్నల పేరిరెడ్డి, ఆరిమండ బసవకుటుంబరెడ్డి, బొంతు పోతిరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్ని వేగవంతం చేయండి

అధికారులకు కమిషనర్ చేకూరి కీర్తి ఆదేశం



బీఆర్ స్టేడియం అభివృద్ధిపై అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి, పక్కన నూరి ఫాతిమా

నెహ్రూనగర్: నగరంలో అభివృద్ధి పనులు వేగంగా జరగాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి అధికారుల్ని ఆదేశించారు. ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు సమన్వయంతో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఆమె గురువారం ఏటుకూరు రోడ్డులోని బృందావన్ అపార్ట్‌మెంట్స్ నుంచి నిర్మాణంలో ఉన్న డ్రెయిన్ పనులు, బీఆర్ స్టేడియం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనుల్ని నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళికాధికారులు, శాప్ అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల వేగవంతానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెండర్ పొందిన కాంట్రాక్టర్లు పనుల్ని వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. పట్నంబజార్ నుంచి కబాడీగూడెం వరకు ప్రజలు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్య శాశ్వత పరిష్కారం కోసం 820 మీటర్ల సీసీ స్ట్రాం వాటర్ డ్రెయిన్‌ను రూ.3.53 కోట్లతో నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. డ్రెయిన్ నిర్మాణ ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపు చేపట్టాలని పట్టణ ప్రణాళిక అధికారుల్ని ఆదేశించారు. నిర్మాణ పనులు వేగంగా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ జరిగేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని కమిషనర్ చెప్పారు. అనంతరం బి.ఆర్.స్టేడియంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్ని శాప్ అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత గడువు పెట్టుకొని చేయాలని, తూర్పు నియోజకవర్గంలో ప్రజలందరికీ ఉపయోగంగా స్టేడియాన్ని తీర్చిదిద్దాలని ఆదేశించారు. స్టేడియానికి అవుట్ సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులు నగరపాలక సంస్థ చేపడుతుందని, శాప్ ఇంజినీరింగ్ అధికారులు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా మాట్లాడుతూ స్టేడియంలో జరిగే అభివృద్ధి పనులు క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. క్రీడలకు సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ శ్రీధర్, డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు మీరావలి, అబీద్ బాషా, వేముల జ్యోతి పద్మజ, ఏఈ సునీల్ కుమార్ తెలిపారు.

21న 'మండలిలో మాస్టారు' పుస్తకావిష్కరణ



ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న లక్ష్మణరావు, వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి, కళాధర్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం శాసనమండలిలో 16 ఏళ్లపాటు చేసిన ప్రసంగాల సంకలనం "మండలిలో మాస్టారు" పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు తెలిపారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం ఆహ్వాన పత్రికల్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఎన్జీవో కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొననున్న శాసనమండలి చైర్మన్ కె.మోషేన్ రాజు పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి, బలహీనవర్గాలు తదితర అంశాలపై బాలసుబ్రహ్మణ్యం శాసనమండలిలో ప్రస్తావించారని చెప్పారు. ఎమ్మెల్సీలు ఐ. వెంకటేశ్వరరావు, పి.రఘువర్మ, జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నక్కా వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ పాల్గొననున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. ఆదిలక్ష్మి, ఎం. కళాధర్, బి. ప్రసాద్, జి.వి.వి. సుబ్బారాయుడు పాల్గొన్నారు.

నేతన్నలకు న్యాయం చేసిన ఏకైక నాయకుడు సీఎం జగన్

- చేనేతలంతా వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలి
- బీసీలకు చట్టం తెస్తామన్న లోకేష్ బీసీల సీటు లాక్కొంటున్నారు..
- బీసీ సంకల్ప సభలో ధ్వజమెత్తిన నాయకులు



మాట్లాడుతున్న కేశన శంకరరావు

మంగళగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో గతంలో ఎన్నడూ లేని విధంగా పద్మశాలీయులకు రెండు ఎమ్మెల్సీ, ఒక ఎంపీ సీటును కేటాయించి బీసీల పట్ల ఉన్న ప్రేమను నిరూపించుకున్నారని, బీసీ సంక్షేమ సంఘం నాయకులు కొనియాడారు. నగరంలోని రత్నాల చెరువులో గురువారం బీసీ సంకల్ప సభ నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావుతో పాటు పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు. అసెంబ్లీ స్థానాలు మంగళగిరి, ఎమ్మిగనూరు, కదిరిని పద్మశాలీయులకు ముఖ్యమంత్రి కేటాయించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలోని నేతన్నలు ఆయనకు అండగా నిలుస్తారన్నారు. బీసీ చట్టం తెస్తానన్న లోకేష్ బీసీలు అత్యధికంగా ఉన్న మంగళగిరి సీటు లాక్కోవడమేనా.. తెచ్చే చట్టం, అజండా అని నిలదీశారు. చంద్రబాబు, లోకేష్ దుర్మార్గపు చర్యలను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ సామాజిక వర్గాలు గమనిస్తున్నాయన్నారు. కుట్రలను బీసీలంతా ఐక్యంగా తిప్పికొడతామన్నారు. బీసీ సంకల్ప సభ అజండాను ప్రకటించారు. తమ న్యాయమైన కోర్కెలు తీర్చే పార్టీలకే రానున్న ఎన్నికలలో బీసీలంతా అండగా ఉంటారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పద్మశాలీయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, డైరెక్టర్ పారేపల్లి విజయలక్ష్మి, ఆరికటిక కార్పొరేషన్ డైరెక్టర్ శివరామ్ బాబాజీ, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

ఫిరంగిపురం: ప్రతి ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి(ఎస్‌యూఓ) బి.చంద్రశేఖర్ సూచించారు. మండల కేంద్రంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న స్పందన అనే మహిళకు డెంగీ జ్వరం వచ్చి గుంటూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న ఆయన గురువారం డెంగీ వచ్చిన మహిళ ఇంటి చుట్టుపక్కల 80 గృహాల వారి వివరాలు సిబ్బంది ద్వారా సేకరించారు. వారికి రక్తపూత పరీక్షలు చేశారు. డెంగీ వ్యాధి లక్షణాలను వివరించారు. కొన్ని గృహాల వద్ద ఎబెట్ ద్రావణాన్ని పిచికారి చేయించారు. ఎస్‌యూఓ వెంట సీహెచ్‌ఓ వెంకటరమణ, హెచ్‌ఎస్ కె.సుదర్శనరాజు, హెచ్‌ఏలు బాబురావు, బాబావలి, కిషోర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మొబైల్ షాపులో చోరీ

మంగళగిరి: నగర పరిధిలో మొబైల్ షాప్‌లో గత బుధవారం రాత్రి చోరీ జరిగింది. మంగళగిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగర పరిధిలో కాజాకు చెందిన చల్లా వేణుగోపాల్‌రెడ్డి సెల్‌ఫోన్ షాప్ నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం దుకాణం తెరిచేందుకు రాగా షట్టర్ తాళాలు పగలకొట్టి ఉండటాన్ని గమనించాడు. చోరీ జరిగిందని గుర్తించి, రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దుకాణంలో సుమారు రూ.50వేల విలువైన సెల్ ఫోన్స్, ఇయర్ ఫోన్స్ చోరీ జరిగినట్లు అందులో పేర్కొన్నాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీ పార్కింగ్ విషయంలో ఘర్షణ

తాడేపల్లిరూరల్ : పాత జాతీయ రహదారి వెంబడి పోలకంపాడు వద్ద లారీ పార్కింగ్ విషయంలో ఇద్దరు ఓనర్ల మధ్య గురువారం ఘర్షణ చోటుచేసుకోగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలకంపాడుకు చెందిన బత్తుల మోహనరావు తన ఇంటి ముందు రహదారి వెంబడి లారీని నిలుపదల చేశాడు. అదే ప్రాంతంలోని గంగాధర శ్రీను అతని లారీ వెనుకనే తన లారీని పార్క్ చేశాడు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. లారీ తీయడానికి వచ్చిన గంగాధర శ్రీనును బత్తుల మోహనరావు కర్రతో విచక్షణా రహితంగా కొట్టాడు. దీంతో వారిద్దరి కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకోవడంతో.. ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో శ్రీను కొడుకు సాయి తలకు తీవ్ర గాయమైంది. అతడిని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. సాయి తాడేపల్లి పోలీస్ స్టేషన్ వద్ద ఫిర్యాదు చేస్తుండగా బత్తుల మోహనరావు బంధువుల మరోసారి అతని తల్లిదండ్రులపై దాడికి పాల్పడ్డారు. సంఘటనపై ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందెం స్థావరంపై దాడి

గుంటూరు రూరల్: కోడి పందేల నిర్వాహకులను అరెస్ట్ చేసిన ఘటన గురువారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాంబాబు వివరాల మేరకు.. ఓబులునాయుడుపాలెం శివారులో కోడి పందేల స్థావరంపై దాడి చేశామని తెలిపారు. కోడి పందేలు నిర్వహిస్తున్న పది మందిని అరెస్ట్ చేసి, కోడితో పాటు రూ. 1.82 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టుకు అప్పగించనున్నట్లు తెలిపారు.

ముట్లూరులో మందుబాబుల వీరంగం

సచివాలయం, ఎండీయూ వాహనం అద్దాలు ధ్వంసం



పగలగొట్టిన సచివాలయం కిటికీ అద్దాలు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం ముట్లూరులో మందుబాబులు వీరంగం సృష్టించారు. బుధవారం రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పూటుగా మద్యం తాగి గ్రామంలోని సచివాలయం-1, సచివాలయం -2 కిటికీల అద్దాలు ధ్వంసం చేశారు. అంతటితో ఆగకుండా గ్రామంలో నిలిపి ఉంచిన ఎండీయూ వాహనం అద్దాలను సైతం పగలగొట్టారు. ఇది మందుబాబుల పనేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా గురువారం ఉదయం సచివాలయం తీసేప్పటికి అద్దాలు పగిలిఉండటం, గాజు పెంకులు చెల్లాచెదురుగా పడి ఉండటంతో పంచాయతీ కార్యదర్శి బి. సుబ్బారావు పోలీసులకు లిఖిపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

నేటి నుంచి సమగ్ర కులగణన సర్వే

మున్సిపల్ కమిషనర్ జశ్వంతరావు



తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సమగ్ర కుల గణన సర్వేకు తెనాలి పట్టణంలోని ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు గురువారం పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు శుక్రవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు ప్రతి ఇంటికి వచ్చి సర్వే చేస్తారని చెప్పారు. సర్వేలో సామాజిక, ఆర్థిక పరిస్థితులు, కుల ఆధారిత డేటాను వారు సేకరిస్తారన్నారు. ఇంటి యజమానులు వాటిని తెలియజేయటం వల్ల ఎటువంటి నష్టం ఉండదని తెలిపారు. ఎవరైన అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందుకోలేకపోతే అలాంటి వారికి వెంటనే వాటిని అందించే విధంగా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ప్రజలు ఇచ్చే సమాచారం ఎంతో భద్రంగా, గోప్యంగా ఉంటుందని వివరించారు.

శివాలయం ప్రతిష్టోత్సవం ఆహ్వాన ప్రతుల ఆవిష్కరణ



ఆహ్వాన గోడ పత్రికల ఆవిష్కరణ

తెనాలి: గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలంలోని వేమవరం గ్రామంలో కోటి ఒక్క లింగాల శివాలయం ప్రతిష్టోత్సవం మహోత్సవం గోడపత్రికలను గురువారం తెనాలిలో ఆవిష్కరించారు. స్థానిక బాలాజీరావు పేటలో వివిధ హిందూ సంస్థలు, సంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీ శివలింగేశ్వర భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా వేమవరంలో కోటి ఒక్క లింగాల మహాకాళి సహిత మహాకాలేశ్వరస్వామి శివాలయాన్ని వేమవరంలో నిర్మించినట్టు తెలిపారు. అయోధ్య రామమందిర ప్రతిష్ఠ ముహూర్తానికే అంటే ఈ నెల 22న మధ్యాహ్నం 12.20 గంటలకు ప్రతిష్ఠ జరుగుతుందని తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొని మనసారా లింగాలను తిలకించి, ఆ మహాదేవుని అన్నప్రసాదాన్ని స్వీకరించి, ఉచితంగా రుద్రాక్షను పొంది తరించాలని నల్లగొర్ల శ్రీనివాసరావు, వేమ సురేష్‌బాబు భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యలవర్తి సాంబశివరావు, కుర్రా శ్రీనివాసరావు, నల్లగొర్ల నాగేశ్వరరావు, తుల్లిమిల్లి పోతురాజు, ఓలేటి ప్రతాప్, సమ్మిడి నారాయణ, ఆర్‌ఎంపీ కోటేశ్వరరావు, పెరుగు మల్లికార్జునరావు, వేల్పుల గంగాధర్, ఎం.రమాదేవి, కొత్తగొర్ల శ్రీనివాసరావు, రాజకొండ మురళీకృష్ణ, మునిపల్లి వెంకట రఘునాథరావు, బాణావత్ బాలునాయక్ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా



మహిళకు రక్త పరీక్ష చేస్తున్న టెక్నీషియన్

తెనాలిఅర్బన్: పేదల ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఎంతో భరోసా కల్పిస్తున్నాయని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను గురువారం మారీసు పేటలోని ఎన్‌సీఆర్ఎస్ఎంహెచ్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. నిపుణులైన వైద్యుల ద్వారా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తోందన్నారు. అందరు శిబిరాలను ఉపయోగించుకోవాలని సూచించారు. డాక్టర్ వి.దేవికావాణి మాట్లాడుతూ వైద్య శిబిరంలో జనరల్ ఓపీ-61, గైనకాలజీ-42, జనరల్ మెడిసిన్-74, అప్తమాలజీ -61 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విలిఖిత, డాక్టర్ టి.వినీల్, సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర రెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి అందే బాలచంద్రమౌళి, శ్రీకంఠ ఉమాకాంత్, వంగల పున్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లలో మౌలిక వసతులు కల్పించాలి



అధికారులకు సూచనలిస్తున్న నోడల్ అధికారి విజయలక్ష్మి

తెనాలిరూరల్: నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిసతులు ఉండేలా చూడాలని అస్యూర్డ్ మినిమమ్ ఫెసిలిటీస్(ఏఎంఎఫ్) జిల్లా నోడల్ అధికారి, సర్వ శిక్షా అభియాన్ కో-ఆర్డినేటర్ జి. విజయలక్ష్మి అధికారులకు సూచించారు. తెనాలి నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులపై గురువారం ఆమె సమీక్ష నిర్వహించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో జరిగిన సమావేశంలో పోలింగ్ బూత్‌ల వివరాలు తెలుసుకున్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో విద్యుత్, తాగునీటి సదుపాయం, దివ్యాంగుల కోసం ర్యాంపు, మరుగుదొడ్లు వంటి వసతులు ఉండేలా చూడాలన్నారు. నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల్లో 17 ర్యాంపులు, 21 మరుగుదొడ్లు ఏర్పాటు చేయాల్సి ఉందని అధికారులు నోడల్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. తెనాలి, కొల్లిపర తహసీల్దార్లు కె. రవిబాబు, జి. నాంచారయ్య, మున్సిపల్ కమిషనర్ ఎం. జస్వంతరావు, విద్యాశాఖ అధికారులు మేకల అలక్ష్మీనారాయణ, వి. జయంత్‌బాబు, జి. సాల్మన్‌రాజు, వి. ఝాన్సీలత, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

మంగళగిరి: నగరంలోని నృసింహస్వామి ఆలయం వద్ద ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు తెలిపారు. గురువారం ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి కార్యాలయంలో అధికారులు ఎమ్మెల్సీ హనుమంతరావు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ట్రాఫిక్ నియంత్రణకు పలు సూచనలు చేశారు. పార్కింగ్‌కు చర్యలు తీసుకోవాలన్నారు.